# మార్పు

నాదెళ్ళ అనూరాధ



ముంబయి వి.టి. ఎప్పటి లాగే జన ప్రవాహంతో ఉక్కిరి బిక్కిరిగా ఉంది.

లోకల్ దిగి ప్రభ, నేను సురేష్ కోసం ముందు నిర్ణయించుకున్న చోటులో లగేజ్‌తో సహా నిలబడ్డాం. ఇంకో అరగంటలో తనెక్కే రైలు ఈ పరిసరాలు దాటి వెళ్లిపోతుంది. మళ్లీ ఎప్పుడో!

ఈ సిటీకున్న గ్లామర్ మరి ఏ సిటీకీ లేదేమో! నిత్యం పరుగులు తీసే ఈ జనసందోహం, ఈ వేగం తానెంతగా విసుక్కున్నా ఏదో ఆకర్షణ తనకి ఈ సిటీ పట్ల ఏర్పడి పోయిందన్నది మాత్రం వాస్తవం.

"అత్తయ్యా! అడుగో, సురేష్ వచ్చాడు" అంటున్న ప్రభ మాటలకి కదిలి ముగ్గురం మినార్ ఎక్స్‌ప్రెస్ వైపు అడుగులు వేశాం. సురేష్‌ని చూడగానే పొద్దున్నే ఇంట్లో జరిగిన సంఘటన మనసులో మెదిలింది.

అతను ఏదేదో మాట్లాడుతున్నాడు. ఆఫీసులో పర్మిషన్ తీసుకుని తానెలా పరిగెత్తుకు వచ్చాడో హుషారుగా చెబుతున్నాడు. ప్రభ ఉత్సాహంగా వింటోంది. ముఖం కాంతివంతంగానే ఉంది. లోపల బాధ పడుతోందా, ఏమో! ఇంత నిండుతనం, గాంభీర్యం ఎక్కడ తెచ్చుకుంది ఈ పిచ్చిపిల్ల!

నా కోసం రిజర్వు చేసుకున్న బెర్త్ దగ్గర సామాన్లన్నీ సర్ది పెట్టాక 'ఆంటీ! ప్రయాణంలోకి మీ కింకా ఏమైనా కావాలా? ఇంకో రెండు పత్రికలు తెచ్చిపెట్టనా" అంటూనే మరో రెండు పుస్తకాలతో తిరిగొచ్చాడు.

ఎదుటి వ్యక్తికి ఏం కావాలో ఎంతో శ్రద్ధగా అమర్చే అతని స్వభావం ప్రశంసించ దగ్గదే, కాని... ఏమో, ఒక్కోసారి అతని ప్రవర్తన మరో రకంగా ఉంటుంది.

ప్లాట్‌ఫారం మీద ప్రభ, సురేష్ ఇద్దరూ హాయిగా నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. ఎంతో సహజంగా ప్రేమగా కన్పిస్తోందా జంట చుట్టూ ప్రపంచానికి. నేనే ఎక్కువగా ఆలోచిస్తున్నానా?

రైలు కదిలింది. హ్యాండ్‌బ్యాగ్ తెరిచి టికెట్ ఒకసారి చూసుకుని మూసేస్తుంటే ప్రభ ఉత్తరం కంట పడింది. చేతిలోకి తీసుకున్నాను.

"నా ప్రియమైన అత్తయ్యా!"

బావున్నావా? నా పెళ్లి అయిన దగ్గర్నుంచీ నా ఇంటినీ, సంసారాన్నీ చూసేందుకు వస్తానని ఎన్ని వాగ్దానాలు చేశావ్! సురేష్, నేను కాకుండా ఇందూ, మీనా కూడా మా సంసారంలోకి వచ్చారు. అయినా నువ్వు ఒక్కసారైనా వచ్చి నీ మాట నిలబెట్టుకోలేక పోయావ్! సురేష్ అమెరికా ప్రయత్నాలు సక్సెస్ అయ్యాయి. ఇంకో నెలలో తను వెళ్లిపోతాడు. ఆపైన పిల్లలూ, నేనూ!

"సురేష్ వెళ్లేలోపు నువ్వొస్తావని ఎదురు చూస్తున్నాం. మమ్మల్ని నిరాశచెయ్యకు. రిజర్వేషన్ చేసుకుని వెంటనే ఫోన్ చెయ్యి. నీ ప్రభ."

ప్రభ ఏడేళ్ల పిల్లగా ఉన్నప్పుడు తన దగ్గరకు తెచ్చుకుంది. తన అన్న, వదిన కూతుర్ని చూడాలను కున్నప్పుడు వచ్చి వెళ్తూండేవారు. కాని ప్రభ మాత్రం అమ్మానాన్నల కోసం ఎన్నడూ బెంగ పడేది కాదు.

ప్రభని పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో పెంచింది తను. ఎక్కడా ఎలాంటి ఓటమి అంగీకరించేది కాదు. ధైర్యం, చొరవ, తెలివి తేటలతో ఎప్పుడూ తన తోటి వారి మధ్య ప్రత్యేకంగా ఉండేది.

ఉద్యోగరీత్యా తను దేశం అంతా తిరిగింది. రిటైరైన ఈ ఏడాదిలో ప్రభ రమ్మని వత్తిడి చెయ్యడం ఎక్కువైంది. ఎప్పటి కప్పుడు ఏవో ఆటంకాలే. ఆఖరికి పిల్లలు దేశం వదిలి దూరాలెళ్లిపోతున్నారన్న ఆత్రంతో తను రైలెక్కింది.

గత వారం రోజులుగా ప్రభ, సురేష్, ఆ పసి వాళ్లతో ఎలా గడిచి పోయిందో అంత వేగంగా! రైలు దిగిన దగ్గర్నుంచీ 'అత్తయ్యా' అంటూ పసి పిల్లల్లా తన వెంట వెంట తిరిగింది.

భర్త ఉన్నంత సేపూ అతని తోడిదే లోకం. సురేష్ ప్రతి పని

ఆమె చేతుల మీదుగానే జరగాలి. ఇదివరకు భోజనానికి లేచి రమ్మంటేనే చిరాకు పడేది.

ఈ వారం రోజులుగా తను గమనించింది. గలగలమంటూ తానెక్కడుంటే అక్కడ చుట్టూ ఉన్నవారిని హోరులో ముంచెత్తేస్తూ ఉండేది. ఇప్పుడా ఉరకలు లేవు.

సురేష్ ఏదో చెబుతూంటాడు. ఆమె ఊ కొడుతుంది. అతన్ని జాగ్రత్తగా, శ్రద్ధగా అటెండ్ అవుతుంది. సాయంకాలం పిల్లల్ని తయారుచేసి చూస్తుంది.

అతను వస్తాడు. స్నానం చేసి రిలాక్స్ అయ్యేవరకు పెదవి విప్పడు. ఆపైన పిల్లల మధ్య పసివాడిలా అవుతాడు. ఒక్క అరగంట తర్వాత వాళ్లు ఆటలాపి తమ కోసం కేటాయించిన గదిలో కెళ్లి నిద్రపోవాల్సిందే.

ఆ తర్వాత భార్య కిచెన్‌లో వేడిగా రొట్టెలు చేసి పెడుతూంటే కమ్మగా కబుర్లు చెబుతాడు. అప్పుడూ ఆమె శ్రోతే.

'అత్తయ్యా' అంటూ దగ్గర కూర్చుంటే మాత్రం పసిపిల్లలా కబుర్లు చెబుతుంది. ఎలాంటి అరమరికలు లేనట్లుండే ఆ భోళాతనం అలాగే ఉంది.

"సురేష్ చూడు, అత్తయ్యా! నాకోసం ఎంత కష్టపడుతున్నాడో- తెల్లవారిన దగ్గర్నుంచీ ఊపిరాడనంత బిజీ. పనీ. నేను మళ్లీ జాబ్‌లో చేరతానంటే వద్దంటాడు. పిల్లల్నీ, నన్ను సుఖపెట్టడమే తన ధ్యేయం అంటాడు. అన్నీ తనే చూసుకుంటాడు. ఒక్క విషయంలోనూ- అది పెద్దదైనా, చిన్నదైనా ఏ నిర్ణయమూ తీసుకోలేను నేను."

సురేష్ అహర్నిశలూ "నిన్నింకా కంఫర్టబుల్‌గా చూసుకోవాలి" అంటూ చెప్పే మాటలు ప్రభ మీద బాగా ప్రభావం చూపిస్తున్నాయి. అతని కలా ఇష్టం.

"ప్రతి చిన్న విషయానికి ఆమె తన దగ్గరకి రావాలి. తన మీద ఆధారపడాలి.అవన్నీ తను స్వయంగా తీర్చి ఆమెను సంతోష పెట్టాలి. అన్నట్లుంటుంది" అతని ధోరణి.

ఎక్కడ కందిపోతుందో అన్నట్లు చూసే అతనే సహనాన్ని కోల్పోయినప్పుడల్లా అంత రఫ్‌గానూ ప్రవర్తిస్తున్నా డనిపిస్తుంది. అతని ప్రవర్తనని ఆక్షేపించదు. నిరసించదు. నిశ్శబ్దంగా భరిస్తుంది.

చదువుకునే రోజుల్లో తన ఆత్మాభిమానానికి ఎక్కడైనా చిన్న ఛాలెంజ్ ఎదురైందంటే పెద్ద ఎత్తున ఎదుర్కొనే ప్రభ ఇప్పుడు మౌనంగా అతని అసహనాన్ని, అహంకారాన్ని భరిస్తోంది. అతని ప్రేమ ఆమెనలా కట్టి ఉంచుతోందా?

ప్రభ చాలా మారింది. నా కంటికి స్పష్టంగా తోస్తోంది. 'అత్తయ్యా! ఎదురింటి భాటియా ఆంటీకి మన బొబ్బట్లు, పులిహోర ఎంతిష్టమోతెల్సా' అంటూ ఆ పూట చేసిన స్పెషల్స్ పట్టుకుని ఎదుటి ఫ్లాట్ కెళ్లింది.

భాటియా కూతురు కాబోలు ఒక్క నిముషం తర్వాత తలుపు తీసింది. మంచి నిద్రలోంచి లేచి వచ్చినట్లుంది. 'లంచ్‌చేసి నిద్రపోయే టైమని నీకు తెల్సు కదా ఆంటీ. ఇప్పుడే డిస్టర్బ్ చేసి ఇవ్వన్నీ ఇవ్వాలా?' అంటోందా అమ్మాయి విసుగ్గా.

మర్యాదకైనా చిరునవ్వులేదు. చిన్న థ్యాంక్స్ లేదు. ప్రభ ఎలాంటి ఫీలింగ్ లేకుండా అనలేం పట్టించుకోనట్లు నాతో కబుర్లలోకి దిగడం నాకు ఆశ్చర్యంగా తోచింది. ఎంత సెన్సిటివ్‌గా ఉండేది. ఇప్పుడు దేన్నీ సీరియస్‌గా తీసుకుంటున్నట్లే కన్పించదు.

❀ ❀ ❀

సాయంకాలం టీ తాగుతుంటే సురేష్ ఫోన్‌కాల్.

"ఆంటీ! మీరంతా ఈ పూట చెంబూర్ వెళ్లి వచ్చేయండి. నేను వచ్చేసరికి ఆలస్యమవుతుంది."

చెంబూర్ నుండి వస్తూంటే ప్రభ చెబుతోంది- "బలానీ ఆంటీ ఏమీ మారలేదు. అశోక్ చూడు పెళ్లయ్యాక ఎంత మారిపోయాడో! నోరు విప్పి ఒక్కమాటైనా మాట్లాడాడా? ఇది వరకైతే నువ్వు పదిరూపాయలు లంచం ఇచ్చినా పావుగంట కూడా నోరు మూసుకుని ఉండనివాడు."

అవును. ఆ మార్పు కనిపిస్తోంది. కాని ప్రభ!

ఇంటికొచ్చేసరికి పిల్లలు నిద్రకూ తూగుతున్నారు. గబగబా కుక్కర్ పెట్టి, పిల్లల డ్రెస్ మార్చి, వాళ్లకు తినిపించి నిద్రపుచ్చేంతలో అతను రానే వచ్చాడు.

"ఎలా జరిగింది చెంబూర్ యాత్ర" అంటూ భోజనానికి కూర్చున్నవాడల్లా టేబిల్ మీద రోటి లేకపోవడం చూసి అంతెత్తున ఎగిరిపడ్డాడు.

అప్పటిదాకా అంత సరదాగా ఉన్న మనిషి ఒక్కసారిగా మూడ్ మారిపోయింది. తానొక పరాయి వ్యక్తి అక్కడ ఉంది. అంత నిస్సంకోచంగా అతనలా ప్రవర్తించడం తనకు ఇబ్బందికరంగా అన్పించింది.

ఆకలి లేదంటూ అతను లేచి వెళ్లిపోయాడు.

క్షణం ఆగి, ప్లేట్లో వడ్డించుకున్నది తిని తామూ లేచారు.

తెల్లవారి మళ్లీ మామూలుగా భార్య చేత అన్ని సేవలు అందుకుని ఏం జరగనట్లే వెళ్లిపోయాడు.

పనులన్నీ ముగించుకుని తీరిగ్గా కూర్చున్నాక ప్రభ బాధపడింది. భోజనం విషయంలో సురేష్ ఖచ్చితంగా ఉంటాడని తెలిసీ తను ఆ పూట రోటీ చెయ్యకుండా వంట ముగించడం తన అపరాధమేనంటుంది.

ఒక్కపూట అతను సర్దుకోలేడా? తన ఇంట్లో తనక్కావలసినట్లు ఉండాలనుకోవడం బాగానే ఉంది. కాని ఇంట్లో అతిథి ఉంది. బయట కెళ్లి రావడంతో వీలు కాలేదు అని సరిపెట్టుకోవచ్చును. ఆమె కూడా చెప్పదేం?

❀ ❀ ❀

ఆ రోజు తన ప్రయాణపు హడావుడి. తెల్లవారిన దగ్గర్నుండీ ఒక్కక్షణం నిలవలేకుండా పరుగులెత్తుతూ అన్నీ తయారు చేస్తోంది. సురేష్ ఆఫీసుకు తయారవుతున్నాడు. ఇంతలో ఏదో ఫోన్‌కాల్. దాదాపు పది నిమిషాలు సీరియస్‌గా మాట్లాడాడు. ఇంతలో పిల్లలిద్దరూ ఆటల మధ్య హాల్లోకి పరిగెత్తుకొచ్చారు. అంతపని తొందరలోనూ ప్రభ కిచెన్‌లోంచి రానే వచ్చింది.

ఫోన్ క్రెడిల్ చేస్తూనే 'ప్రభా' అంటూ గావుకేక పెట్టాడు. ఆ కోపంలో టిఫెన్‌కూడా చెయ్యకుండా వెళ్లిపోయిన సురేష్‌ని చూసి ప్రభకి దిగులు.

అదెంత ముఖ్యమైన కాల్ అయినా పసి పిల్లలున్న ఇంట కొంత డిస్టర్బెన్స్ తప్పనిదే. అది అతను అర్థం చేసుకోడేం. అతను నవ్వితే నవ్వాలి. కోపం వస్తే ఎదుటివాళ్లు మౌనంగా భరించాలి. అతని నిరంకుశత్వం, స్వార్థం ఆమెకు అర్థం కావెందుకు? అతను వెళ్లాక అన్యమనస్కంగా ప్రభ అంటోంది -

"ఒక్క పిసరు కోపం, విసుగూ ఉన్నాయి. కాని అత్తయ్యా తను మా కోసం పడే ఆరాటం చూస్తే తనకి నేనేం చెయ్యగలనా అన్పిస్తుంది?"

అతను భార్యా బిడ్డల కోసం కష్టపడుతున్నాడు. నిజమే. అతను సుఖపెడతానంటున్నాడు. ఆ లాలనలో తన వ్యక్తిత్వాన్ని స్వాతంత్ర్యాన్ని వదులుకుంటోంది ఇష్టపూర్వకంగా.

భౌతికమైన సుఖాలకెప్పుడూ తాను విలువ ఇవ్వలేదు. తన చేతుల్లో పెరిగిన ప్రభ! ఇంత మార్పెలా వచ్చింది? కాలంతో పాటు సమాజ వాతావరణంలో వచ్చిన మార్పు ప్రభ వ్యక్తిత్వం మీద పూర్తిగా ఉంది. నేనేం చెప్పను? అది పూర్తిగా ఆమె జీవితం. తనకు నచ్చిన విధంగా జీవించే అధికారం పూర్తిగా ఆమెదే! ●

